చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి: ఎస్పీ

మాట్లాడుతున్న ఎస్పీ బాలస్వామి శిక్షణలో పాల్గొన్న జిల్లా అధికారులు, సిబ్బంది

మెదక్ అర్బన్, జూన్ 27: నూతన చట్టాలపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉం డాలని ఎస్పీ డాక్టర్ బాలస్వామి అన్నారు. గురు వారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో నూతన చట్టాలపై అదనపు ఎస్పీ ఆ ధ్వ ర్యంలో అధికారులకు, సిబ్బందికి శిక్షణ త ర గతులు నిర్వహించారు. ఎస్పీ మాట్లాడు తూ జూలై 1 నుంచి దేశవ్యాప్తంగా భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత, భారతీయ సాక్ష్యా అధినియం-2023 చట్టాలు అమలులోకి వస్తున్నాయ న్నారు. ప్రతి పోలీస్ అధికారి సిబ్బందికి కొత్త చట్టాలపై అవగాహన ఉండాలని తరగతులు నిర్వహించామన్నారు. నూతన చట్టాలతో కేసుల దర్యాప్తు, విధి విధానాలు, విచారణ పద్ధతుల్లో, శిక్షల్లో మార్పు వస్తుందన్నారు.

బడీడు పిల్లల్ని పాఠశాలలో చేర్పించాలి

డి.ధర్మారంలో గ్రామస్తులు, ఐకేపీ సిబ్బంది, డ్వాక్రా సంఘాలతో ర్యాలీ

రామాయంపేట, జూన్ 27: బడి బయట ఉన్న పిల్లలందరూ బడిలో చేరాలని జడ్పీహెచ్ఎస్ హెచ్ఎం రాజుపంతులు అన్నారు. గురువారం డీధర్మారంలో డ్వాక్రా సంఘాలు, ఐకేపీ సిబ్బంది, విద్యార్థులు, గ్రామస్తులతో కలిసి ర్యాలీ చేపట్టారు. పాఠశాలలో కళాకారులతో ఆటపాటలతో హోరెత్తించారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందని, ఉచితంగా చదువు, యూనిఫామ్లు, పాఠ్యపుస్తకాలు ఇస్తున్నట్లు తెలిపారు.

మట్టి అక్రమ రవాణాపై చర్యలు తీసుకోవాలి

సమావేశంలో మాట్లాడుతున్న ఇరిగేషన్ ఈఈ శ్రీనివాస్రావు

ఇరిగేషన్ ఈఈ శ్రీనివాస్రావు

నర్సాపూర్, జూన్ 27: చెరువుల్లోంచి అక్రమంగా మట్టి తరలిస్తున్నా, పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఇరిగేషన్ ఈఈ శ్రీనివాస్రావు తెలిపారు. గురువారం నర్సాపూర్లోని ఇరిగేషన్ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. శివంపేట్ మండలంలోని చిన్న గొట్టిముక్కల పరిధిలో ఉన్న బాయన్న చెరువు, పటేల్ చెరువు నుంచి కొందరు అనుమతుల్లేకుండా మట్టిని తరలిస్తున్నారని ఇరిగేషన్ సిబ్బంది పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారన్నారు. అయినా కేసు నమోదు చేయకుండా, పట్టించుకోవడం లేదని వాపోయారు. రైతులు పొలాలకు మట్టి తీసుకెళ్లాలంటే అనుమతి తీసుకుని ఉచితంగా తీసుకెళ్లొచ్చన్నారు. చెరువు, కుంటల తూములకు బుంగలు పడితే మరమ్మతులు చేయించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. సమావేశంలో ఇరిగేషన్ డీఈ బుజ్జిబాబు, ఏఈలు మణిభూషన్, సునీత ఉన్నారు.

కోర్టు ఏర్పాటుకు భవనం పరిశీలన

కోర్టు ఏర్పాటుకు భవనాన్ని పరిశీలిస్తున్న తూప్రాన్ ఆర్డీవో జయ చంద్రారెడ్డి

తూప్రాన్, జూన్ 27: తూప్రాన్లో జూనియర్ సివిల్ కోర్టు ఏర్పాటు చేయడానికి తాత్కాలిక వసతి కోసం పట్టణంలోని పుట్టకోటలో ఖాళీగా ఉన్న పాత ప్రభుత్వ బాలుర వసతి గృహాన్ని అధికారులు, ప్రజా ప్రతినిధులతో కలిసి ఆర్డీవో జయచంద్రారెడ్డి గురువారం సందర్శించారు. ఈనెల 29న జిల్లా జడ్జి పరిశీలించి, తుది నిర్ణయం ఉంటుందని ఆర్డీవో తెలిపారు. మున్సిపల్ చైర్పర్సన్ జ్యోతీకృష్ణ, వైస్ చైర్మన్ శ్రీనివాస్, తహసీల్దార్ విజయలక్ష్మి, కమిషనర్ ఖాజా మొయినొద్దీన్, పీఆర్ ఏఈ మధుసూదన్, శివానందం ఉన్నారు.

ఈ పాస్ మిషన్లతో ఎరువుల విక్రయాలు

రికార్డులు తనిఖీ చేస్తున్న మెదక్ ఏడీఏ విజయలక్ష్మి

రామాయంపేట, జూన్ 27: లైసెన్స్ కలిగిన ఫర్టిలైజర్ వ్యాపారులు జిల్లా వ్యాప్తంగా ఈ పాస్ మిషన్ల ద్వారా ఎరువులు, విత్తనాలు విక్రయించాలని మెదక్ డివిజన్ వ్యవసాయ శాఖ సహాయ సంచాలకురాలు విజయలక్ష్మి తెలిపారు. గురువారం రామయాంపేటకు విచ్చేసిన ఆమె ఫర్టిలైజర్ దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి లైసెన్సుదారుడి వద్ద కచ్చితంగా ఈ పాస్ మిషిన్ ఉండాలన్నారు. జిల్లా వ్యాప్తంగా డీలర్లందరూ తప్పనిసరిగా నిబంధనలు పాటించాలన్నారు. రైతులు కూడా తమ ఆదార్ వివరాలను వ్యాపారులకు అంద జేయాలన్నారు. వానకాలం సీజన్లో కావాల్సిన ఎరువులు, విత్తనాలు సిద్ధంగా ఉన్నాయన్నారు. ఏవో రాజ్నారాయణ ఉన్నారు.

ఆలయ నిర్మాణ దాతకు సన్మానం

రెడ్డిపల్లి గ్రామంలో హరీశ్‌ను సన్మానిస్తున్న గ్రామస్తులు

నర్సాపూర్, జూన్ 27: మండలంలోని రెడ్డిపల్లిలో నిర్మిస్తున్న హనుమాన్ ఆలయానికి తనవంతు సాయంగా దాత హరీశ్ 40 టన్నుల ఇసుక, 50 బస్తాల సిమెంట్ విరాళంగా ఇస్తానని హామీ ఇచ్చారు. దీంతో గురువారం గ్రామస్తులు అతడిని సన్మానించారు.

నిధులు వెనక్కి తీసుకోవడం సమంజసం కాదు

- మంజూరైన రూ.170 కోట్ల నిధులను విడుదల చేయాలి
- ఉత్తమాటలతో కాలం వెల్లదీస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం
- ఎఫ్డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి

కిష్టాపూర్ గ్రామంలో విలేకరులతో మాట్లాడుతున్న ఎఫ్డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి



రెండు కుటుంబాలకు బీఆర్ఎస్ పార్టీ ప్రమాద బీమా చెక్కులు అందజేస్తున్న ప్రతాప్‌రెడ్డి

తూప్రాన్, జూన్ 27: బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో గజ్వేల్ నియోజకవర్గానికి సంబంధించిన పలు అభివృద్ధి పనులకు రూ.170 కోట్లు మంజూరు చేశారని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని వెనక్కి తీసుకుని గజ్వేల్ అభివృద్ధిని అడ్డుకుంటున్నదని ఆయన మండిపడ్డారు. మండలంలోని కిష్టాపూర్ గ్రామానికి చెందిన పిట్ల బాలేశ్, పిట్ల వెంకటేశ్ ప్రమాద వశాత్తు నీటిలో మునిగి మృతి చెందారు. కిష్టాపూర్ విచ్చేసి, రూ. 2 లక్షల చొప్పున ఇరు కుటుంబాలకు మంజూరైన బీఆర్ఎస్ పార్టీ ప్రమాద బీమా చెక్కులను బాధిత కుటుంబ సభ్యులకు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ గజ్వేల్ నియోజకవర్గంలో అసంపూర్తిగా మిగిలి ఉన్న పంచాయతీ భవన పనులు, సీసీ రోడ్లు, కుల సంఘాల భవనాల నిర్మాణాలు, వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు నిధులేక ముందుకు సాగడం లేదన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం కండ్లు తెరిచి గతంలో మంజూరైన రూ.170 కోట్ల నిధులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కక్ష సాధింపు చర్యలతో నిధులు వెనక్కి తీసుకుని అభివృద్ధిని అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. రైతు భరోసా ఇప్పటికీ ఇవ్వలేదన్నారు. కరెంటు కూడా సరిగ్గా లేక నానా అవస్థలు పడుతున్నారన్నారు. కేసీఆర్ ప్రభుత్వం రెండు దఫాలుగా ప్రతి రైతుకు రూ.లక్ష రుణమాఫీ చేసిందని, కానీ కాంగ్రెస్ రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పి, ఉత్తమాటలతో కాలం వెళ్లదీస్తున్నదన్నారు. 90 శాతం మంది రైతులకు రూ.2 లక్షల రుణం ఏ బ్యాంకులో ఉండదన్నారు. యాసంగి పంటలకు కాంగ్రెస్ ప్రభుత్వం రూ.500 బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ రాణి సత్యనారాయణ గౌడ్, యావాపూర్ మాజీ సర్పంచ్ నరసింహారెడ్డి, ఎంపీటీసీ సంతోష్‌రెడ్డి, నాయకులు మాచిరెడ్డి కృష్ణారెడ్డి, మల్లారెడ్డి, ఆంజనేయులు గౌడ్, శ్రీశైలం, అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

ధరణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

- ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాసామర్థ్యాలు మెరుగుపడాలి
- చిలిపిచెడ్ మండలంలోని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ పర్యటన

చిలిపిచెడ్ తహసీల్ కార్యాలయంలో ధరణి పెండింగ్ దరఖాస్తులను పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

చిలిపిచెడ్ రైతు ఆగ్రో సేవా కేంద్రంలో స్టాక్ రిజిస్టర్, ఎరువులను పరిశీలిస్తున్న కలెక్టర్

చిలిపిచెడ్, జూన్ 27: జిల్లాలో ధరణి పెండింగ్ దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులకు ఆదేశించారు. గురువారం చిలిపిచెడ్ తహసీల్, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, రైతు ఆగ్రో సేవా కేంద్రం, అంగన్వాడీ కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు.

అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ధరణి సమస్యలపై ప్రత్యేక కార్యాచరణ అమలు చేసి వారం రోజుల్లో పెండింగ్ దరఖాస్తులు పరిష్కరించాలన్నారు. జిల్లాలోని తహసీల్దార్లు రోజువారీగా సమస్యలపై పరిష్కారం చేయాలన్నారు. విద్యాబోధనపై సమస్యలను ప్రభుత్వ పాఠశాలల్లోని పదిమంది తరగతి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. చదువులో విద్యార్థులు వెనుకబడినట్లు కలెక్టర్ గుర్తించించారు. ఉపాధ్యాయులు, డీఈవోకు పలు సూచనలు చేస్తూ సబ్జెక్టుల వారీగా బోధనా విధానాల్లో ఒక నెల గడువులోపు మార్పు రావాలని, మళ్లీ క్షేత్రస్థాయి పర్యటనలో విద్యార్థుల సామర్థ్యాల్లో వ్యత్యాసం కనబడాలని ఆదేశించారు.

చిలిపిచెడ్లో పర్యటించి బడి బయట పిల్లలు ఎవరైనా ఉన్నారా స్వయంగా విద్యార్థుల తల్లిదండ్రులను అడిగి తెలుసున్నారు. అనంతరం అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించి చిన్న పిల్లలకు అందుతున్న పౌష్టికాహారం వివరాలను అంగన్వాడీ టీచర్‌ను అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో మూడేండ్లు నిండిన చిన్న పిల్లలను అంగన్వాడీ సెంటరులో చేర్పించాలని సూచించారు. మండల కేంద్రంలోని రైతు ఆగ్రో సేవా కేంద్రం, ఎరువుల షాపును కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం ఎరువుల స్టాక్, రిజిష్టర్, గోదాంలోని ఎరువుల నిల్వలను పరిశీలించారు. రైతులకు కావాలసిన ఎరువులు,విత్తనాలు అందుబాటులో ఉంచాలని, రైతులకు ఎలాంటి కొరత లేకుండా చూడాలని తెలిపారు. యూరియా 10168 మెట్రిక్ టన్నులు, డీఏపీ 704 మెట్రిక్ టన్నులు, కాంప్లెక్స్ ఎరువులు 4417మెట్రిక్ టన్నులు, పొటాష్ 373, సూపార్ పాస్పేట్ 285, మొత్తం 15947 మెట్రిక్ టన్నుల ఎరువులు జిల్లా వ్యాప్తంగా అందుబాటులో ఉన్నాయన్నారు. కలెక్టర్‌తో జిల్లా వ్యవసాయాధికారి గోవింద్, జిల్లా విద్యాధికారి రాధాకృష్ణ, తహసీల్దార్ ముసాద్దీక్, డిప్యూటీ తహసీల్దార్ సింధూజ, కాంప్లెక్స్ హెచ్ఎం విఠల్, అధికారులు పాల్గొన్నారు.

డి.ధర్మారంలో మురుగు కాల్వలను శుభ్రం చేస్తున్న పారిశుధ్య కార్మికులు

జోరుగా కొనసాగుతున్న పారిశుధ్య పనులు

రామాయంపేట, జూన్ 27: మండలంలో పారిశుధ్య పనులు జోరందుకున్నాయి. గురువారం మండలంలోని డీ.ధర్మారం, సుతారిపల్లి, కోనాపూర్, శివ్వాయపల్లి, ఆర్.వెంకటాపూర్ తదితర గ్రామాల్లో మురుగు కాల్వలు శుభ్రం చేశారు. దోమలు వ్యాప్తి చెందకుండా బ్లీచింగ్ పౌడర్ చల్లి, రాత్రి పూట వీధుల్లో ఫాగింగ్ చేశారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.

పరిసరాల శుభ్రత అందరి బాధ్యత

నిజాంపేట, జూన్ 27: పరిసరాల శుభ్రత అందరి బాధ్యత అని గ్రామ ప్రత్యేకాధికారి, తహసీల్దార్ సురేశ్‌కుమార్ అన్నారు. గురువారం ఆయన ఎస్సీ కాలనీ ఇండ్ల సమూహాల మధ్య ఉన్న మురుగు కాల్వల్లో కలుపు మొక్కలు, చెట్లను పారిశుధ్య కార్మికులు, జేసీబీ సహాయంతో తొలిగింపజేశారు. పంచాయతీ కార్యదర్శి నర్సింహులు ఉన్నారు.

పారిశుధ్య పనులను పర్యవేక్షిస్తున్న గ్రామ ప్రత్యేకాధికారి తహసీల్దార్ సురేశ్‌కుమార్

జీలుగతో అధిక దిగుబడి

నర్సాపూర్, జూన్ 27: జీలుగ, జనుము వేయడంతో నేల సారవంతం అవ్వడమే కాకుండా పంట దిగుబడి పెరుగుతుందని ఏడీఏ సంధ్యారాణి సూచించారు. గురువారం మండలంలోని రుస్తుంపేట్లో జీలుగా పంట పొలాలను పరిశీలించారు. పచ్చిరొట్ట ఎరువుల ప్రాముఖ్యతను రైతులకు వివరించారు. పూత దశలో ఉన్న జీలుగను పొలంలోనే రొటవేటర్ సాయంతో కలియదున్నాలన్నారు. తర్వాత 100 కిలోల సింగిల్ సూపర్ పాస్ఫేట్ దుక్కిలో వేయడంతో పొలంలో కుళ్లి పచ్చిరొట్ట ఎరువుగా తయారవుతుందన్నారు. కార్యక్రమంలో ఏవో దీపిక, ఏఈవో చంద్రవేణి, రైతులు పాల్గొన్నారు.

పచ్చిరొట్టతో మంచి దిగుబడి

శివ్వంపేట, జూన్ 27: పచ్చిరొట్టతో మంచి దిగుబడి సాధించవచ్చని ఏవో లావణ్య అన్నారు. గురువారం ఆమె శివ్వంపేటలో జీలుగు పొలాన్ని పరిశీలించారు. రైతులు పచ్చిరొట్టతో రసాయన ఎరువుల వాడకం తగ్గించవచ్చని అన్నారు. పచ్చిరొట్ట కుళ్లి ఎరువుగా మారి మంచి దిగుబడి వస్తుందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కొనసాగుతున్న భగీరథ సర్వే

పెద్దశంకరంపేట, జూన్ 27: మండలంలోని అన్ని గ్రామాల్లో మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ తాగునీరు సక్రమంగా సరఫరా అవుతుందా లేదా అంశంపై పంచాయతీ కార్యదర్శులు సర్వే చేపడుతున్నారు. గురువారం పట్టణంలోని ఆయా కాలనీల్లో ఇంటింటికీ తిరుగుతూ లబ్ధిదారుడి వద్ద ఆధార్ నంబర్ సేకరించి నల్లాను పరిశీలించి ఫొటోలను ఆన్లైన్లో అప్లోడ్ చేస్తున్నారు. శనివారం లోగా సర్వే పూర్తి చేయనున్నట్లు తెలిపారు.

పెద్దశంకరంపేటలో మిషన్ భగీరథ పై సర్వే చేస్తున్న పంచాయతీ కార్యదర్శులు

జడ్జి ఆధ్వర్యంలో హిట్ అండ్ రన్ సమావేశం

మాట్లాడుతున్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి జితేందర్

మెదక్ అర్బన్, జూన్ 27: జిల్లా న్యాయస్థానాల సముదాయంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ న్యాయమూర్తి జితేందర్ ఆధ్వర్యంలో హిట్ అండ్ రన్ కేసులకు సంబంధించిన సమావేశాన్ని మెదక్లో నిర్వహించారు. ఈ సమావేశంలో రెవెన్యూ డివిజనల్ అధికారి రమాదేవి, మెదక్ డీఎస్పీ రాజేశ్, మెదక్ పట్టణ సీఐ నాగరాజు, రూరల్ సీఐ కేశవులు తదితరులు పాల్గొన్నారు.

ఇంటి పనులు ఆపాలని కలెక్టర్‌కు ఫిర్యాదు

నిర్మిస్తున్న ఇల్లు

మెదక్ మున్సిపాలిటీ, జూన్ 27: స్థలాన్ని ఆక్రమించి మున్సిపల్ నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోకుండా ఇంటి నిర్మాణం చేపడుతున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని మెదక్‌కు చెందిన భిక్షపతి కలెక్టర్ రాహుల్ రాజ్‌కు గురువారం ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఫతేనగర్ వీధికి చెందిన సున్నం రాంచందర్ పాత ఇంటిని కూల్చి, నిర్మాణ పనులు ప్రారంభించారని, తన ఇంటి స్థలాన్ని ఆక్రమించాడని ఆరోపించారు. మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులకు మే 10న ఫిర్యాదు చేసినా పట్టించుకున్న పాపన పోలేదన్నారు. ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా పనులు మాత్రం యాధావిధిగా కొనసాగుతున్నాయన్నారు. ఈ నేపథ్యంలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు భిక్షపతి తెలిపారు.

సదరం చంద్రికాదేవికి డాక్టరేట్

సదరం చంద్రికాదేవి

రామాయంపేట, జూన్ 27: మండలంలోని కోమటిపల్లి గ్రామంలోని తెలంగాణ మాడల్ స్కూల్, జూనియర్ కళాశాల అధ్యాపకురాలు సదరం చంద్రికాదేవి డాక్టరేట్‌కు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ అమ్‌తుల్ జమాల్ ఆస్తా తెలిపారు. గురువారం తోటి అధ్యాపకురాళ్లు, స్కూల్ టీచర్లు ఆమెను సన్మానించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ నీలం సంజీవరెడ్డి కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషనల్ జామ్‌బాగ్‌లోని అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ యాకయ్య ఆధ్వర్యంలో ఎడ్యుకేషనల్ విభాగంలో కోర్సు పూర్తి చేశారన్నారు. టు స్టడీ ద ఇంపాక్టు ఆఫ్ స్లీప్ డిప్రైవేషన్ ఆన్ హెల్త్, అకడమిక్ అచీవ్‌మెంట్ అండ్ స్టడీ హ్యాబిట్ ఆఫ్ సెకండరీ స్కూల్ స్టూడెంట్స్ అనే అంశంపై అధ్యయనం చేసినట్లు తెలిపారు. ఇందుకు గాను ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్‌కు ఎంపికయ్యారన్నారు.

వన మహోత్సవానికి ఏర్పాట్లు

గొట్టిముక్కులలో గుంతల పనులను పరిశీలిస్తున్న ఏపీవో నవాజుద్దీన్

పెద్దశంకరంపేట, జూన్ 27: త్వరలో ప్రారంభంకానున్న వన మహోత్సవానికి చురుకుగా ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. గురువారం మండల పరిధిలోని గొట్టిముక్కుల గ్రామంతో పాటు ఆయా గ్రామాల్లో రహదారులకు ఇరువైపులా మొక్కలను నాటేందుకు ఉపాధి కూలీలతో గుంతలు తీసి పనులు చేపట్టారు. ఆయా గ్రామాల్లో ఉపాధి హామీ సిబ్బంది పనులను పర్యవేక్షిస్తున్నారు. ఆయా పనులను ఈజీఎస్ ఏపీవో నవాజుద్దీన్ పరిశీలించారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు.

భక్తిశ్రద్ధలతో సీతారాముల కల్యాణం

కల్యాణ మహోత్సవానికి హాజరైన భక్తులు

పుల్కల్, జూన్ 27: సీతారామ చంద్రస్వామి ప్రథమ వార్షికోత్సవం పురస్కరించుకొని గురువారం మండల పరిధిలోని పెద్దారెడ్డిపేటలో సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. విగ్రహ దాత శ్యామ్ ప్రసాద్‌రావు దంపతులు ఈ కార్యక్రమాన్ని జరిపించారు. ఈ కార్యక్రమానికి పెద్దారెడ్డిపేటతో పాటు చుట్టుపక్కల గ్రామాల భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. అంతకు ముందు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ప్రతి ఏడాది నిర్వహించే కార్యక్రమానికి భక్తులు భారీ సంఖ్యలో హాజరవుతారని సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ యాదగిరిరెడ్డి, నాయకులు అంజయ్య, సుభాష్, నారాయణ పాల్గొన్నారు.

అంబాజీపేటలో తాగునీటి కటకట

కుమ్మరివాడలో మరమ్మతులకు నోచుకోని సింగిల్ఫేజ్ బోరు మోటర్

పంచాయతీ ట్యాంకర్‌ను కాంట్రాక్టు పనులకు వినియోగిస్తున్న దృశ్యం

- తాగునీటి కోసం బోరు బావులను ఆశ్రయిస్తున్న గ్రామస్తులు
- వారం అవుతున్నా.. పట్టించుకోని అధికారులు
- మరమ్మతుకు నోచుకోని మోటరు
- మాజీ సర్పంచ్ కుమారుడి చేతిలో పంచాయతీ వాటర్ట్యాంక్

బోర్ నీటిని పట్టుకుంటున్న గ్రామస్తులు

చిన్నశంకరంపేట, జూన్ 27 : మండల పరిధిలోని అంబాజిపేటలో మంచినీటి కోసం గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గ్రామంలో సింగిల్ఫేజ్ మోటర్లు కాలిపోయి వారం రోజులు గడుస్తున్నా సంబంధిత అధికారులు మరమ్మతులు చేయించడం లేదని గ్రామస్తులు ఆరోపించారు. మిషన్ భగీరథ నల్లా నీరు రాక తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తాగునీటి కోసం వ్యవసాయ బోరు బావులను ఆశ్రయించాల్సిన దుస్థితి నెలకొందన్నారు. మంగళవారం మిషన్ భగీరథ నల్లా నీరు రాలేదు. మరోవైపు గ్రామంలో ఉన్న సింగిల్ఫేజ్ మోటర్ కాలిపోయింది. గ్రామ పంచాయతీ వాటర్ ట్యాంక్తో నీటి సరఫరా చేస్తారేమోనని గ్రామస్తులు ఎదురు చూశారు. ఈ వాటర్ ట్యాంకును అధికారులకు సమాచారం లేకుండా మాజీ సర్పంచ్ కుమారుడు తన కాంట్రాక్టు పనులకు వినియోగించడంతో నీళ్లు లేక గ్రామస్తులు నానా అవస్థలు పడ్డారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. లేనిపక్షంలో ఆందోళన చేపడతామని గ్రామస్తులు హెచ్చరించారు. ఈ విషయమై గ్రామ ప్రత్యేక అధికారి దామోదర్‌ను అడుగగా పంచాయతీ ట్రాక్టర్లు సమాచారం ఇవ్వకుండా మాజీ సర్పంచ్ కుమారుడు తన సొంత పనులకు తీసుకెళ్లాడని తెలిపారు. గ్రామంలో కాలిపోయిన సింగిల్ఫేజ్ మోటర్లకు వెంటనే మరమ్మతులు చేయించి తాగునీటి సమస్యను పరిష్కరిస్తామన్నారు.